సాక్షి ఏలూరు

శనివారం । 22 । ఆగస్టు । 2026



ఆంక్షల చిత్రం

కుంకుళ్లమ్మ ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఉత్సవమూర్తికి బదులు, ఆమె ఫ్లెక్సీకి అలంకరణ చేయడం విమర్శలకు తావిచ్చింది.

8లో ▸

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

భీమవరం మండలంలోని కొత్తపూనలమర్రు-లోసరి రోడ్డు ప్రయాణికులకు, వాహనదారులకు తీవ్ర అవస్థలు కలిగిస్తోంది.

8లో ▸

ప్రభుత్వ ఆసుపత్రా?

పాలకొల్లు ప్రభుత్వాస్పత్రా? లేక డంపింగ్ యార్డా అంటూ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుడాల గోపీ గళమెత్తారు.

8లో ▸

గురువులకు క్లస్టర్ కష్టాలు

- సమావేశాల నిర్వహణపై ఏడాదికో మార్పు
- గతంలో ఉదయం బడికి.. మధ్యాహ్నం మీటింగ్‌కు..
- నేటి నుంచి సగం టీచర్లు సమావేశాలకు..
- మిగిలిన వారికి పాఠశాలల్లో విధులు
- మూడు, నాలుగు శనివారాల్లో ఇదే పరిస్థితి

నిడమర్రు: విద్యారంగంలో మార్పుల పేరిట కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. తాజాగా కస్టర్ కాంప్లెక్స్‌ల నిర్వహణలో మార్పులు చేస్తూ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈనెల నుంచి వచ్చే ఫిబ్రవరి వరకు వీటి నిర్వహణ తేదీలను ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం నుంచి ఉమ్మడి జిల్లాలోని 144 క్లస్టర్లలో సమావేశాలు నిర్వహించనున్నారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇకపై ఇలా.. గతేడాదిలో ప్రతి నెలా మూడో శనివారం ఉపాధ్యాయులంతా ఉదయం పాఠశాలకు హాజరై.. మధ్యాహ్నం నుంచి క్లస్టర్ సమావేశాలకు వెళ్లేవారు. అయితే ఇకపై ప్రతినెలా 3, 4 శనివారాల్లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈనెల 22, 29 తేదీల్లో సమావేశాలు జరగనున్నాయి. ప్రతి పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుల సంఖ్య ఆధారంగా సగం మంది 22న, మిగిలిన వారు 29న తప్పనిసరిగా హాజరవ్వాల్సి ఉంటుంది. అలాగే సబ్జెక్టు క్లస్టర్ మీటింగులకు 22న నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టు టీచర్లు, 29న లాంగ్వేజ్ టీచర్లు హాజరవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సమావేశాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించనుండగా.. ఉదయం 9 గంటలోపు ఆయా క్లస్టర్ల వద్ద లీప్ యాప్‌లో తప్పనిసరిగా ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎంఈఓలు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఉమ్మడి జిల్లాలో క్లస్టర్లు ఇలా..

జిల్లా	ప్రైమరీ	సబ్జెక్ట్	మొత్తం
పశ్చిమగోదావరి	20	40	60
ఏలూరు	28	56	84
మొత్తం	48	96	144

సెలవులకు అవకాశం లేదు : క్లస్టర్ నిర్వహణ రోజుల్లో ఉపాధ్యాయులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయరాదని అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. కేవలం మెడికల్ గ్రౌండ్ మినహా ఎలాంటి సెలవులకు అవకాశం లేదు.

ఉపాధ్యాయులకు దూరాభారం

గతంలో సమావేశాలను ఆయా మండల పరిధిలో మూడు, నాలుగు క్లస్టర్లలో నిర్వహించేవారు. అయితే ఇకపై మండలం మొత్తం టీచర్లు ఒకే క్లస్టర్ సమావేశానికి హాజరవ్వాల్సి ఉంటుంది. సబ్జెక్టు సమావేశాలైతే రెండు, మూడు మండలాల పరిధుల్లో నిర్వహించనున్నారు. దీంతో ఉపాధ్యాయులకు 15 నుంచి 40 కిలోమీటర్ల మేర దూరభారం కానుంది. ముఖ్యంగా మహిళా టీచర్లకు రవాణా సమస్య ఎదురుకానుంది.

టీచర్లు లేని బోధన ఎలా..

పాఠశాలల్లో సగం మంది ఉపాధ్యాయులే ఉంటే బోధన ఎలా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రతినెలా రెండు రోజులపాటు బోధన కుంటుపడుతుందనే విమర్శలు వస్తున్నాయి. అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలల విషయంలో టీచర్ సమావేశానికి వెళ్తే పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు డిప్యూటేషన్‌పై విధులు కేటాయించారు.

బోధన కుంటుపడుతుంది

నెలలో రెండు రోజులు క్లస్టర్ సమావేశాలతో ఆయా స్కూళ్లలో బోధన కుంటుపడే అవకాశం ఉంది. టీచర్లకు బోధనా సమయం తగ్గుతుంది. సమావేశాలు పక్క మండలాల్లో నిర్వహించడం వల్ల మహిళా ఉపాధ్యాయులకు దూరం భారం. ఉన్నతాధికారులు పునరాలోచించాలి.

– బొర్రా గోపీమూర్తి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

పక్క మండలానికి మార్చారు

సబ్జెక్టు కాంప్లెక్స్‌లు ఏర్పాటు అయిన నాటి నుంచి ఇప్పటివరకూ గణితం సబ్జెక్టు కాంప్లెక్స్ గణపవరంలోనే ఉంది. దీనిని ప్రస్తుతం అత్తిలి మండలానికి మార్పు చేశారు. దీంతో గణపవరంలోనే కొనసాగించాలని ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచితే పరిశీలిస్తామన్నారు.

– పుప్పాల ప్రకాశరావు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు

న్యూస్‌లీల్

24న ఉప రాష్ట్రపతి ముసునూరు రాక

సీపీ రాధాకృష్ణన్, ఉప రాష్ట్రపతి

నూజివీడు/ముసునూరు: భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈనెల 24న ముసునూరు మండలంలో పర్యటించనున్నారు. 24న ఉదయం 7.15 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.35 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు గన్నవరం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి, 11 గంటలకు ముసునూరులోని గౌర్మెట్ పాప్ కార్నికా ఫ్యాక్టరీకి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.15 గంటల వరకు నూతన పాప్‌కార్న్ సీడ్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12.35 గంటలకు ముసునూరు నుంచి రోడ్డు మార్గానా గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళతారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో మంత్రి కొలుసు పార్థసారథి ఈనెల 22న ముసునూరు విచ్చేసి ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించనున్నారు.

వీవీఎం పోస్టర్ల ఆవిష్కరణ

వీవీఎం పోటీల పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పోటీలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని డీఈఓ ఓవీఎస్ అనిల్‌కుమార్ తెలిపారు. వీవీఎం పరీక్షల పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ విద్యా పరిశోధన మండలి, జాతీయ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీలకు ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి తరగతి నుంచి కనీసం ఇద్దరు విద్యార్థులు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. వీవీఎం జిల్లా కో-ఆర్డినేటర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ సెప్టెంబర్ 30లోపు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ 98496 66417లో సంప్రదించాలని కోరారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ.నారాయణ, భీమవరం ఎంఈఓలు ఎన్.శ్రీనివాసరావు, కేఎస్‌సీహెచ్ సాయిరాం, వీవీఎం జిల్లా జాయింట్ కో-ఆర్డినేటర్ మల్లుల శ్రీనివాస్, టెక్నికల్ కో-ఆర్డినేటర్ సయ్యద్ షహింషా పాల్గొన్నారు.

27న వ్యవసాయ డిప్లామా కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్

మార్టేరులో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

పెనుమంట్ర: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లామా కోర్సులకు మాన్యువల్ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసే నిమిత్తం, జోనల్ స్థాయిలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారన్నారు. గోదావరి మండలానికి సంబంధించి ఈనెల 27న తమ పరిశోధనా స్థానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. యూనివర్సిటీ పాలిటెక్నిక్‌లు మారుటేరు, రంపచోడవరం, ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్‌లు కొయ్యలగూడెం, పాలకొల్లు, కాకినాడ, ద్రాక్షారామం, మూలపాలెంలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మారుటేరు లేదా వ్యవసాయ పాలిటెక్నిక్, మారుటేరు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

28 నుంచి ఏఐపై వర్క్‌షాప్

భీమవరం: భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు యంత్ర దృష్టి. తెలివైన నాణ్యత నియంత్రణ ద్వారా లోపరహిత తయారీ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. వేణు చెప్పారు. శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈనెల 28, 29 తేదీల్లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) వాణిజ్య పథకం ప్రాయోజికంగా మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ రంగానికి సంబంధించిన తాజా సాంకేతిక అంశాలపై వర్క్‌షాప్ నిర్వహిస్తారన్నారు. వర్క్‌షాప్‌లో పరిశ్రమ, విద్యారంగాలకు చెందిన నిపుణులు ప్రసంగిస్తారన్నారు. ఏఐసీటీఈ ఆమోదిత విద్యాసంస్థల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, ఎంటెక్ స్కాలర్స్, పరిశ్రమ నిపుణులు పాల్గొనవచ్చన్నారు. ఏఐసీటీఈ అటల్ అకాడమీ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని వేణు తెలిపారు.

వాసవీమాత సన్నిధిలో హైకోర్టు జడ్జి

పెనుగొండలో హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డికి వేద ఆశీర్వచనం అందిస్తున్న పండితులు

పెనుగొండ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి దంపతులు శుక్రవారం పెనుగొండ నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయాన్ని, అఖిల భారత వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధామను సందర్శించారు. మూలవిరాట్ వాసవీ మాతకు, నగరేశ్వరునికి, మహిషాసురమర్దనీకి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వాసవీ శాంతి ధాంలో 102 అడుగుల రుషీ గోత్ర మందిరంలోని 90 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవీ మాతకు పూజలు నిర్వహించారు. పండితులు ఆలయ మర్యాదలతో వేదాశ్వీరచనం అందించారు.

30న స్కేటింగ్ సెలెక్షన్స్

తణుకు అర్బన్: తణుకు మున్సిపల్ స్కేటింగ్ రింక్‌లో ఈనెల 30న ఎన్‌డ్యూరెన్స్ స్కేటింగ్ జిల్లా స్థాయి సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు స్కేటింగ్ కోచ్ వి.లావణ్య తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 25లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరన్ని వివరాలకు 96423 31332లో సంప్రదించాలని కోరారు.

కూటమివి దిగజారుడు రాజకీయాలు

కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పొగాకు వ్యాపారులు

కొయ్యలగూడెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు అడ్డాగా మారిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు విమర్శించారు. గవరవరం సెంటర్‌లో మండల రైతు విభాగం అధ్యక్షుడు గంటా రమేష్, గ్రామాల కన్వీనర్లు పలివెల దుర్గారావు, అత్తిలి కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుంటూరు మాజీ ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడు ముబ్బషీర్‌లపై పొగాకు వ్యాపారి కడిమి సూరిబాబు పెట్టిన అక్రమ కేసుల వెనుక కూటమి కుట్ర ఉందని ఆరోపించారు. ముస్తఫా వద్ద రూ.35 లక్షల అడ్వాన్స్ తీసుకుని ఏడాది దాటినా పొగాకు ఇవ్వకుండా, వేరే కంపెనీలకు విక్రయించడాన్ని ప్రశ్నించినందుకే ఈ కక్ష సాధింపు అని మండిపడ్డారు. అరెస్టులో ఉన్న ముస్తఫాకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంఘీభావం తెలపడాన్ని విమర్శించే స్థాయి సూరిబాబుకు లేదన్నారు. సూరిబాబుతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని గతంలోనే ఆయనను దూరంగా పెట్టామని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నూకల రాము స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పొగాకు వ్యాపారులు మాట్లాడుతూ తామంతా ముస్తఫా వద్ద అడ్వాన్సులు తీసుకున్నామని వ్యాపారాల్లో నష్టాలొచ్చినా ఆయన తమకు అండగా నిలిచారని తెలిపారు. సూరిబాబు అనేక చోట్ల అడ్వాన్సులు తీసుకుని ఎగవేస్తూ రాజకీయ వేధింపులకు పావుగా మారాడని ఆరోపించారు. ముస్తఫా కుటుంబానికి పూర్తి నైతిక మద్దతు ప్రకటిస్తూ, వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగం నేతలు సీమకుర్తి సత్యనారాయణ, బొమ్మా సత్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ బాజీ, ఎంపీపీ గంజిమాల రామారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దూలపల్లి కాంతారావు, జిల్లా కార్యదర్శి చిడిపి రవి, మిరియాల వెంకటపతి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా.. ఎన్నికలు జరిగేనా?

- కోర్టు కేసులున్న మున్సిపాలిటీలపై సందిగ్ధం
- గూడెంలో ఎన్నికల ఆపడానికి కుట్రలు చేస్తున్నారా !
- జిల్లాలో చర్చనీయాంశంగా పుర ఎన్నికలు

తాడేపల్లిగూడెం: కోర్టు కేసులున్న మున్సిపాలిటీల్లో ఈ సారైనా ఎన్నికలు జరుగుతాయా.. ప్రతిపాదిత విలీన గ్రామాలతో కలిపి ఎన్నికలు నిర్వహిస్తారా.. కోర్టు కేసులు ఎత్తేసి, ప్రత్యేక ఆదేశాలతో పాత వార్డులతోనే ఎన్నికలకు వెళతారా.. జిల్లాలో కోర్టు అభ్యంతరాలున్న పాలకొల్లు, తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెంలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయా.. ఇది ప్రస్తుతం అంతటా జరుగుతున్న చర్చ.. వీటిలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎన్నిక జరిగే అవకాశాలున్నా, వాటిని ఆపడానికి కూటమి నాయకుల తరపున ఎవరైనా ప్రయత్నిస్తున్నారా.. అంటే అవుననే సమాచారం తెలుస్తోంది. గతంలో 35 వార్డులుగా ఉన్న తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో 5 సమీప గ్రామాలను (కొండ్రుపోలు, ఎల్.అగ్రహారం, కుంచనపల్లి, ప్రత్తిపాడు, పడాల) విలీనం చేస్తూ వార్డుల సంఖ్యను 40కి పెంచేందుకు ప్రతిపాదించారు. అయితే దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన కేసుల వల్ల గత ఏడేళ్లుగా ఇక్కడ ఎన్నికలు జరగక ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అలాగే ప్రతిపాదిత ఐదు గ్రామాలకు కూడా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించలేదు. ఇదిలా ఉండగా ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలు మినహా మిగిలిన వంద మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొంది.

గవర్నర్ ఆర్డినెన్స్ మాటేంటి?

మున్సిపాలిటీల్లో సమీప గ్రామాల విలీన ప్రతిపాదనలకు సంబంధించి 2021 జనవరి 12న అప్పటి గవర్నర్ ఆర్డినెన్స్ ఇచ్చారు. దీని ప్రకారం ప్రతిపాదిత పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేసుకోవచ్చని చెబుతున్నారు. వీటిని సవాల్ చేస్తూ కేసులు వేసిన వారు కోర్టును ఆశ్రయించినా గతంలో వాటిని కొట్టేసినట్టు సమాచారం.

1న వాదనలు : తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ఐదు గ్రామాల విలీనానికి సంబంధించి వచ్చేనెల 1న హైకోర్టులో వాదనలు జరుగనున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గతంలో ఈ కేసులను కోర్టులో దాఖలు చేసిన న్యాయవాది ప్రభుత్వ నియామక పోస్టులోకి వెళ్లడంతో ఆయన నుంచి కేసులను కేసులు వేసిన వారు వెనక్కి తీసుకున్నారని తెలుస్తోంది. వాస్తవానికి అప్పట్లో కేసులు వేసిన వారు టీడీపీ సానుభూతిపరులుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ ఇక్కడ ఎన్నికలు జరగాలని ఆకాంక్షిస్తోంది.

కూటమి వ్యూహం.. 'చిదంబర' రహస్యం

తాడేపల్లిగూడెం మున్సిపల్ ఎన్నికల విషయంలో కూటమి వ్యూహం చిదంబర రహస్యంగా ఉంది. ఈ ఎన్నికను రెండేళ్ల కూటమి పాలనకు రిఫరెండంగా భావిస్తున్నట్టు ఆయా నాయకుల ఆలోచనలు కనిపిస్తున్నాయి. సూపర్ సిక్స్ హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో పరాభవం తప్పదనే భయం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కూటమిలో కీలక నాయకుడు ఒకరు జిల్లాలోని తీరప్రాంతానికి చెందిన పేరొందిన హైకోర్టు లాయర్ ద్వారా తాడేపల్లిగూడెం ఎన్నిక నిలుపుదలకు కేసు వేయించినట్టు సమాచారం.

● వరలక్ష్మీ నమోస్తుతే

వరలక్ష్మీ నమోస్తుతే.. వరలక్ష్మీ పాహిమాం.. స్మరణలు మార్మోగాయి. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవార్లు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. భీమవరంలో మావుళ్లమ్మవారిని నాలుగు లక్షల గాజులతో విశేషంగా అలంకరించారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఏలూరు పత్తేబాదలోని కనకదుర్గమ్మను అరిసెలతో అలంకరించారు. దెందులూరు మండలం గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు.

-ఏలూరు (ఆర్ఆర్‌పేట)/దెందులూరు/భీమవరం (ప్రకాశంచౌక్)/

గాజుల అలంకరణలో మావుళ్లమ్మ

అరిసెల అలంకరణలో పత్తేబాద కనకదుర్గమ్మ

దెందులూరు మండలం గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ సన్నిధిలో భక్తులు

పొగాకు సేద్యం.. డోలాయమానం

- ఇళ్లల్లోనే బేళ్లు.. నారుమడులకు సన్నాహాలు
- అధిక దిగుబడులిచ్చే వంగడాలపై దృష్టి
- 28.02 మిలియన్ కిలోలకే అనుమతి
- అయోమయంలో పలువురు రైతులు

బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెంలో పొగాకు నారుమడులు

బుట్టాయగూడెం: పొగాకు రైతులు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక కొందరు రైతులు అల్లాడుతూ ఇళ్ల వద్దే బేళ్లు నిల్వ ఉంచే దుస్థితి కాగా మరోవైపు వచ్చే ఏడాది పంటలు పండించేందుకు కొందరు నారుమడులు సిద్ధం చేస్తున్న పరిస్థితి. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో అధిక దిగుబడులు ఇచ్చే నారుమడులను సిద్ధం చేస్తున్నారు.

అప్పు తీరనూ లేదు.. మళ్లీ సాగు తప్పదు

పొగాకు రైతులు పండించిన పంట అమ్ముడుపోక పోవడంతో చాలా మంది రైతులు అప్పులు తీర్చే మార్గంలేక కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు కొనుగోళ్లు ప్రారంభమై 120 రోజులు దాటుతున్నా కేవలం 20 శాతం మాత్రమే కొనుగోళ్లు జరగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పాత పంట అమ్ముడుపోలేని పరిస్థితిలో ఉన్నా మరోపక్క కొత్త పంట పండించేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. వచ్చేనెల రెండో వారం నుంచి పొగాకు నారుమడులకు అనువైన సమయం కావడంతో సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. 2026-27 పంటల సాగుకు సంబంధించి బోర్డు కూడా అనుమతులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎక్కువగా ఐటీసీ సంస్థ ద్వారా ఎల్-7, 1335 వంగడాలను నారుమడుల్లో వేస్తున్నారు. జంగారెడ్డిగూడెం-1,2, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల పరిధిలో సుమారు 33 వేల హెక్టార్లలో పొగాకు సాగు జరుగుతుంది. ఒడిదుడుకులు ఉన్నా రైతులు మాత్రం పొగాకు సాగుకు మొగ్గుచూపుతున్నారు.

ట్రే నర్సరీల ఏర్పాటు

రైతులు ఎక్కువగా ట్రే నర్సరీలలో పొగాకు నారుమడులను ఏర్పాటు చేస్తున్నారు. పొలాల్లో షెడ్‌నెట్ పందిర్లను వేసి నారుమడులను పెంచుతారు. ట్రే నారు నాణ్యతగా ఉండి చీడపీడలను తట్టుకుంటుందని రైతులు చెబుతున్నారు. నారు ధర ఎక్కువగా ఉన్నా ట్రే నారులను రైతులు ఎక్కువగా నాటుతున్నారు. అక్టోబర్ నుంచి పొగాకు పంట వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ట్రే నారుమడులను జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి, మండలాలతో పాటు పలు గ్రామాల్లో కూడా పెంచుతున్నారు.

పొగాకు ఉత్పత్తికి కోత

2026-27 పంట కాలానికి పొగాకు బోర్డు 28.02 మిలియన్ కిలోలకే అనుమతి ఇచ్చింది. 2025-26 పంట కాలానికి 50.87 మిలియన్‌ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా దానిని కుదించడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. ఈ లెక్కన వచ్చే ఏడాది బేరన్‌కు 2,000 కిలోలు మాత్రమే ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అలాగే ఒక బేరన్‌కు 2 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలి. ఒక్కో సాగుదారుడికి గరిష్టంగా 4 బేరన్‌లకు అనుమతి ఇచ్చారు. 2025-26 పంట కాలంలో బేరన్‌కు 41 క్వింటాళ్లకు అనుమతి ఇవ్వగా దీనిని వచ్చే ఏడాది 20 క్వింటాలకు తగ్గించడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

నాణ్యమైన వంగడాలతోనే..

గతంలో పండించిన పంట ఇంకా పూర్తిస్థాయిలో అమ్ముకాలు జరగలేదు. వచ్చే ఏడాది పంట కాలం రానే వచ్చింది. ప్రస్తుతం పొగాకు నారుమడులు కట్టేందుకు అనువైన సమయం కావడంతో నారుమడులు సిద్ధం చేసుకుంటున్నాం. ట్రే నారుల వల్ల నాణ్యమైన మొక్కలు రావడంతో ఇటుగా మక్కువ చూపుతున్నాం.

– సయ్యద్ బాజీ, పొగాకు రైతు, అచ్చియ్యపాలెం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

ఒక విద్యార్థి.. ఒక టీచర్

జీజీ ఫౌండేషన్ స్కూల్‌లో ఉన్న ఒక విద్యార్థి, ఒక టీచర్

నూజివీడు : మండలంలోని యనమదల మండల పరిషత్ ఫౌండేషన్ పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థికి ఒక ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. గ్రామంలో 150కి పైగా కుటుంబాలు ఉన్నప్పటికీ, రెండో తరగతి వరకు మాత్రమే ఉన్న ఈ స్కూలుకు కేవలం ఒక్క విద్యార్థే వస్తున్నాడు. కాగా అర కిలోమీటరు దూరంలోని యనమదల హైస్కూల్ ఆవరణలోనే శాటిలైట్ స్కూల్ కూడా ఉంది. ఈ విద్యార్థిని అక్కడికి పంపి, ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని అవసరమైన మరో పాఠశాలకు డిప్యూటేషన్ వేసే వెసులుబాటు ఉంది. అయితే విద్యాశాఖ అధికారులు మాత్రం ఈ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

దుకాణం మెట్లపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

మెట్లపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

ద్వారకాతిరుమల: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. రామన్నపాలెం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న ఓ ట్రాక్టర్ నియంత్రణ తప్పి దుకాణం మెట్లపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ తాపీ పని చేస్తున్న దొరసానిపాడుకు చెందిన సోమయ్యను ఢీకొట్టడంతో అతడు గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు హుటాహుటీన పీహెచ్‌సీకి తరలించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రమాద సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

13 అడుగులు దాటితే అంతే..!

ఉండి రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఉండి: జాతీయ రహదారి 165పై ప్రయాణిస్తూ ఉండి రైల్వే గేటు దాటే ప్రయాణికులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని రైల్వే శాఖ అధికారులు గేటు వద్ద ఒక హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఉండి వద్ద ఆర్వోబీ ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటంతో ట్రాక్‌పై భాగంలో విద్యుత్ లైన్ల ఎత్తు కంటే హైట్ గేజ్ ఎత్తును 40 సెంటీమీటర్లు కిందికి దించారు. ఈ కారణంగా గేటు దాటే లారీలు, టిప్పర్లు వంటి అన్ని రకాల సరుకు రవాణా భారీ వాహనాల ఎత్తు 13 అడుగులకు మించకూడదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి 13 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న వాహనాలను తోలితే తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనని, అటువంటి వారిపై రైల్వే చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా లేదా జైలు శిక్ష తప్పదని అధికారులు హెచ్చరించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- దారుణంగా కొత్తపూసలమర్రు – లోసరి రోడ్డు
- నాలుగు కిలోమీటర్ల ప్రయాణానికి గంట సమయం

కొత్తపూసలమర్రు - లోసరి రోడ్డు దుస్థితి రోడ్డుపై జారి పడిపోయిన ద్విచక్ర వాహనదారుడు (ఇన్‌సెట్‌లో)

భీమవరం అర్బన్ : మండలంలోని కొత్తపూసలమర్రు – లోసరి రోడ్డు ప్రయాణికులకు, వాహనదారులకు తీవ్ర అవస్థలు కలిగిస్తోంది. కొత్తపూసలమర్రు శివారు నుంచి లోసరిలోని జాతీయ రహదారి 216ఏకి అనుసంధానంగా ఉండే ఈ రోడ్డు గోతులమయమై ప్రమాదాలకు నిలయంగా మారింది. భీమవరం, కాళ్ల మండలాల ప్రజలకు జాతీయ రహదారికి, కృష్ణా జిల్లాకు చేరుకునేందుకు ఇది అత్యంత దగ్గర మార్గం కావడంతో నిత్యం వందలాది స్కూల్ బస్సులు, ఆటోలు, కార్లు, చేపల లారీలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే సమీపంలోని చేపల మేత ఫ్యాక్టరీకి బరువైన లోడుతో వెళ్లే హెవీ లారీలు కూడా ఈ మార్గాన్నే వినియోగిస్తాయి.

ప్రజాధనం దుర్వినియోగం

సుమారు 4 కిలోమీటర్ల పొడవున్న ఈ కీలక రహదారికి ఇప్పటివరకు తారురోడ్డు వేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్ల క్రితం గ్రామీణులు, రైతులు స్వచ్ఛందంగా చందాలు వేసుకుని వేసిన గ్రావెల్ రోడ్డే నేటికీ ఆధారంగా ఉంది. ప్రాముఖ్యత లేని ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల స్వలాభం కోసం సీసీ రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేస్తున్న సర్కారు, నిత్యం వేలాదిమంది ప్రయాణించే ఈ రహదారిని మాత్రం తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

చినుకు పడితే అస్తవ్యస్తం

కొద్దిపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారి వాహనాలు దిగబడిపోతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించలేక కొందరు కొత్తపూసలమర్రు నుంచి గూట్లపాడు, తోకతిప్ప, బరువానిపేట మీదుగా సుమారు 12 కిలోమీటర్లు అదనంగా చుట్టూ తిరిగి జాతీయ రహదారికి వెళ్లాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, గెలిచాక మరచిపోవడం పరిపాటిగా మారిందని, ప్రజాప్రతినిధులు, ఇప్పటికైనా స్పందించి వెంటనే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఈ రోడ్డు దుస్థితిపై ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా ఈ ఆర్‌అండ్‌బీ పరిధిలో లేదని, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉందని స్పష్టం చేశారు. ఆ శాఖ రోడ్డును వేయాలని తెలిపారు.

గోతులపైనే ప్రయాణం

కొత్తపూసలమర్రు, దొంగపిండి, గూట్లపాడులతో పాటు కాళ్ల మండలానికి వెళ్లేందుకు ఇది దగ్గర మార్గం. రోడ్డంతా భారీ గోతులు పడటంతో ఈ 4 కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు గంట సమయం పడుతోంది. పాలకుల అభివృద్ధి హామీలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు.

– కుక్కల ప్రభాకర్‌రావు, గ్రామస్తుడు, లోసరి

వాహనాలు నడపలేకపోతున్నాం

రోడ్డుపై కొద్దిపాటి వర్షానికే గ్రావెల్ మట్టి బురదగా మారి జారి పడిపోతున్నాం. ద్విచక్ర వాహనాలపై మహిళలను తీసుకెళ్లాలన్నా, సరుకులు తీసుకెళ్లాలన్నా భయంగా ఉంది. అత్యంత ముఖ్యమైన ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర నరకం అనుభవిస్తున్నాం. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– కొల్లాటి సోమరాజు, గ్రామస్తుడు, కొత్తపూసలమర్రు

ఆంక్షల చిత్రం

- కుంకుళ్లమ్మ ఆలయంలో ఫొటోలు, వీడియోల చిత్రీకరణపై ఆంక్షలు
- దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలని చెబుతున్న అధికారులు

ఆలయ ధ్వజస్తంభం వద్ద అమ్మవారి ఫ్లెక్సీకి డ్రైఫ్రూట్స్‌తో చేసిన అలంకరణ ముందు దర్శనమిస్తున్న వైర్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో చినవెంకన్న సోదరిగా పూజలందుకుంటున్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గర్భాలయంతో పాటు ఆలయ ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక అలంకారాలు చేశారు. అయితే ధ్వజస్తంభం వద్ద అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచడానికి బదులుగా, ఆమె ఫ్లెక్సీకి అలంకరణ చేయడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్లెక్సీ స్పష్టంగా కనిపిస్తూ, దాని ఎదురుగా వైర్లు వేలాడుతుండటంపై విస్తుపోయారు. శ్రీవారి ఉపాలయాల్లోనే అత్యధిక ఆదాయం కలిగిన ఈ ఆలయంలో ఉత్సవమూర్తికి పండ్లు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ దండలతో అలంకరించి ఉంటే బాగుండేదని వాపోయారు.

మీడియా చిత్రీకరణపై ఆంక్షలు

దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయాల్లో మూలవిరాట్ల ఫొటోలు, వీడియోలు తీయడంపై ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. దీంతో కుంకుళ్లమ్మ ఆలయంలోనూ అమ్మవారి అలంకారాన్ని చిత్రీకరించేందుకు మీడియాకు అనుమతి లభించలేదు. స్వయంగా ఆలయానికి రాలేని వేలాది మంది భక్తులకు ఉగాది గాజుల అలంకారం, శ్రావణమాస శాకంబరీ అలంకారం, దసరా ఉత్సవాల విశేషాలు మీడియా, సోషల్ మీడియా ద్వారానే తెలిసేవి. తాజా ఆంక్షల వల్ల భక్తులు ఈ అలంకార వైభవానికి దూరమవుతున్నారని, చిన్న ఆలయాల విశిష్టతను ప్రచారం చేయడంలో మీడియా పాత్రను తగ్గించేలా కమిషనర్ నిర్ణయం ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

సాంప్రదాయాలపై ఆంక్షలు సరికావు

ఆలయాలకు వెళ్లలేని భక్తులకు దేవతామూర్తుల అలంకార దర్శనం లేకుండా చేయడం సరికాదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను ఆధ్యాత్మికతకు చేరువ చేయాల్సింది పోయి, ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాలపై ఆంక్షలు విధించి దేవుళ్లను దూరం చేస్తున్నారని మండిపడుతున్నారు. కనీసం ఉత్సవమూర్తుల ద్వారా అయినా అమ్మవారి వైభవాన్ని దర్శించుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఆంక్షల అమలులో వైఫల్యం?

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొన్ని ఆలయాల్లో మాత్రం దేవతామూర్తుల అలంకారాల ఫొటోలు యథావిధిగా సోషల్ మీడియాలో కనిపిస్తుండటం చర్చనీయాంశమైంది. భీమవరంలో మావుళ్లమ్మ అమ్మవారి గాజుల అలంకారం ఫొటోలతో పాటు మరికొన్ని ఆలయాల ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల అమలులో ఆలయాల వారీగా వ్యత్యాసాలు ఉన్నాయా లేదా ఆదేశాల్లో స్పష్టత లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రా? లేక డంపింగ్ యార్డా?

వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజక ఇన్‌చార్జి గుడాల గోపి ధ్వజం

ప్రభుత్వ ఆసుపత్రిలో వేసిన చెత్తను పరిశీలిస్తున్న గుడాల గోపి తదితరులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఇప్పటికే ఉన్న యడ్లబజార్, రామయ్య హాలు డంపింగ్ యార్డులతో పాటు నేడు మంత్రి రామానాయుడు చొరవతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కూడా మూడో డంపింగ్ యార్డులా మారిపోయిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఎద్దేవా చేశఊరు. ఇటీవల ఆసుపత్రి ప్రాంగణంలో ల్యాండ్ ఫిల్లింగ్ పేరుతో చెత్తను తరలించడాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా నిరసించడంతో స్పందించిన ప్రభుత్వం చెత్తను తొలగిస్తామని చెప్పినప్పటికీ, నేటికీ ఆ ప్రక్రియ పూర్తికాలేదన్నారు. శుక్రవారం తమ పార్టీ నాయకులతో కలిసి ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన, అక్కడ ఇంకా మూడు అడుగుల మేర చెత్త పేరుకుపోయి ఉండడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు రోగాలు తగ్గించుకోవడానికి ఆసుపత్రికి వస్తే, మంత్రి సొంత నియోజకవర్గంలో మాత్రం కొత్త జబ్బులు బారిన పడేలా పరిస్థితులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. మైక్ దొరికితే వైఎస్ జగన్‌పై విమర్శలు చేసే మంత్రి రామానాయుడు, తన నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, పనుల్లో నాణ్యతా లోపాలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చెత్తపై మట్టి కప్పి నిధులు పక్కదారి పట్టించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారం లభించింది అభివృద్ధి చేయడానికే తప్ప ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు పెట్టడానికి కాదని స్పష్టం చేశారు. స్థానిక సమస్యలను పట్టించుకోని తీరుకు నిరసనగా శనివారం నుంచి రామనామ జపం చేస్తూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లి అక్రమాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, పాలపర్తి కృపానాథ్, లోపింటి చిరంజీవి, పితాని మురళీ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ, బాలికల అప్పగింత

మహిళ, బాలికలతో పోలీసులు

గణపవరం: ఇంట్లోంచి వెళ్లిపోయిన ఓ మహిళ, ఆమె ముగ్గురు కుమార్తెలను ఫిర్యాదు అందిన నాలుగు గంటల్లోనే గణపవరం పోలీసులు సురక్షితంగా పట్టుకుని శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. వేగంగా స్పందించి ఆచూకీ కనిపెట్టిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ కొమ్మి శివ ప్రతాప్, డీఎస్పీ శ్రావణ్ కుమార్ అభినందించారు. ఎస్సై ఆకుల మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం బువ్వనపల్లికి చెందిన అల్లు శాంతరాజు భార్య రాణి (26), కుమార్తెలు సిరిహాసిని (10), శృతి హర్షిణి (7), శ్రేష్ఠ (4)లతో కలిసి గణపవరం మండలం మొయ్యేరులోని బంధువుల ఇంటికి వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వారు ఇంట్లోంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. బంధువుల ఫిర్యాదుతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో, సీఐ నక్కా రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై మణికుమార్, ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. సాంకేతిక ఆధారాల సహాయంతో వారు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మహిళ, పిల్లల ఆరోగ్య పరిస్థితి బాగుండటంతో బంధువులకు అప్పగించారు. ప్రజలు ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, 112 నంబరుకు గానీ సమాచారం ఇవ్వాలని సీఐ రజనీకుమార్ సూచించారు.

చిట్టీ డబ్బుల కోసం దాడి

ముదినేపల్లి(కైకలూరు): చిట్టీ డబ్బులు తిరిగి ఇవ్వడం లేదనే కోపంతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై ఎస్సై వీరభద్రరావు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం వడాలి గ్రామంలో కొబ్బరికాయల వ్యాపారం చేసే మరీదు ధర్మారావు భార్య గతంలో చిట్టీల వ్యాపారం నిర్వహించింది. కొందరు సభ్యులు చందాలు చెల్లించకపోవడంతో గ్రూపులను నిలిపివేసింది. అదే గ్రామానికి చెందిన నారగాని గంగమ్మ తనకు రావాల్సిన డబ్బుల కోసం కోర్టును ఆశ్రయించడమే కాకుండా తరచూ ధర్మారావు దంపతులతో గొడవపడేది. ఒత్తిడి తట్టుకోలేక ధర్మారావు భార్య ఐదు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోగా, ఆమె విశాఖపట్నంలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. కాగా, గురువారం గంగమ్మ మరో వ్యక్తితో కలిసి ధర్మారావు ఇంటికి వెళ్లి గొడవకు దిగింది. ఈ క్రమంలో గంగమ్మ ధర్మారావు చూపుడు వేలు కొరకడంతో పాటు, తలపై దాడి చేయడంతో తీవ్ర రక్తగాయమైంది. బాధితుడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్ పేరుతో మోసం

ద్వారకాతిరుమల: ఇన్‌స్టాగామ్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ ఆశచూపి ఓ ఇంటర్మీడియట్ విద్యార్థిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. గ్రామానికి చెందిన నండూరి జితేశ్వర్ అనే ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి, ఈ నెల 20న మధ్యాహ్నం ఇన్‌స్టాగామ్‌లో రీల్స్ చూస్తుండగా వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగానికి సంబంధించిన ప్రకటన వచ్చింది. బుక్స్ రాస్తే వారానికి రూ.25 వేలు ఇస్తామని రీల్ రావడంతో వారిని సంప్రదించాడు. అవతలి వ్యక్తులు పంపిన స్కానర్ ద్వారా దఫదఫాలుగా రూ.5,299 చెల్లించాడు. నగదు జమయ్యాక సదరు ఇన్‌స్టాగామ్ ఐడీని సైబర్ మోసగాళ్లు బ్లాక్ చేశారు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జితేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి

రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

జంగారెడ్డిగూడెం (చింతలపూడి): మండలంలోని వేగవరం బీసీ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ డ్రైవర్ దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఖమ్మం–దేవరపల్లి ఎన్‌హెచ్–516డీ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గుజరాత్ నుంచి పిఠాపురం వెళ్తున్న టైల్స్ లారీ, కడియపులంక నుంచి పంజాబ్ వెళ్తున్న మొక్కల లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో టైల్స్ లారీ డ్రైవర్, గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు చెందిన హర్ష్ భాయ్ (55) క్యాబిన్‌లో నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మొక్కల లారీ డ్రైవర్, మైలవరం మండలం కీతిరాయగూడెం వాసి కొణతం వేణు (30) ఛాతి, కాళ్లకు బలమైన దెబ్బలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి జంగారెడ్డిగూడెంలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆశ్రమ్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, రెండు వాహనాల క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యక్ష ఎన్నికలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నీతి ఆయోగ్ సూచనలు, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక సంస్థల అధ్యక్ష స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని ఏపీ అసెంబ్లీ నిర్ణయించడం అభినందనీయమని అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ పొలిమేర హరికృష్ణ అన్నారు. స్థానిక గన్ బజార్‌లో నిర్వహించిన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యక్ష ఎన్నికల విధానం వల్ల ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రజా తీర్పుతో ఎన్నికయ్యామనే భావన కలుగుతుందన్నారు. దీనివల్ల ప్రజాప్రతినిధుల ఫిరాయింపులు, బెదిరింపులు, క్యాంప్ రాజకీయాలకు తెరపడి స్థానిక సంస్థల్లో అభివృద్ధి, సంక్షేమం వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు ఎస్సీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హోమ్ లోన్ సెంటర్-64187, మొదటి అంతస్తు, రవి కాంప్లెక్స్ బిల్డింగ్, డి నెం.17-5-5, ఎ.ఎస్.ఆర్. స్టేడియం రోడ్డు, ఏలూరు, ఏలూరు జిల్లా-534005.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖాచేసిన స్థిరాస్తుల అమ్మకము

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన అస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన అస్తి/ఆస్తుల ఇ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై విక్రయించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

దరఖాస్తుదారు: శ్రీమతి వాడ్రేవు జయ లక్ష్మి, భర్త: వి.ఎస్.ఆర్. మూర్తి, ఫ్లాట్ నెం.FF 4, వైభవ్ టవర్స్, 7వ రోడ్, శ్రీ రామ్ నగర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా. సహ-దరఖాస్తుదారు: శ్రీ వి.ఎస్.ఆర్. మూర్తి, తండ్రి: పూర్ణరావు, ఫ్లాట్ నెం.302, S.R.M. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్, సత్రంపాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా. (హౌసింగ్ లోన్ అకౌంట్ నెం.33553294905)

బకాయి మొత్తం: తేది.19.05.2025 నాటికి రూ.12,16,115/- (అక్షరాల పన్నెండు లక్షల పదహారు వేల నూట పదిహేను రూపాయలు మాత్రమే) + ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొదలగునవి.

స్థిరాస్తి వివరములు

పశ్చిమ గోదావరి జిల్లా, పెదవేగి మండలం, దుగ్గిరాల గ్రామం, యేసుప్రభు విగ్రహం ప్రక్కన, పి.ఆర్.నెం.29, ఫ్లాట్ నెం.15 పద్ద ఆర్ ఎస్ నెం.429/6 లోని విస్తీర్ణం 194.4 చ.గజాల ఖాళీ స్థలము అస్తి శ్రీమతి వాడ్రేవు జయలక్ష్మి, భర్త: వి.యస్.ఆర్. మూర్తి గారికి చెందినది (రిజిస్టర్డ్ అమ్మకం దస్తావేజు నెం.11/2014, తేది.02.01.2014 (ప్రకారం) హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.16 భూమి, పడమర: 24 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం: ఫ్లాట్ నెం.14 భూమి, ఉత్తరం: 30 అ॥ల వెడల్పు రోడ్డు.

రిజర్వు ధర : రూ. 20,82,000/- ధరావత్తు : రూ. 2,08,200/- బిడ్ పెంపుదల : రూ. 10,000/-

ఇ-వేలం తేది : 22.09.2026 సమయం: ఉ॥ 11:00 గం॥ల నుండి సా॥ 04:00 గం॥ వరకు

అస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది.24.08.2026 నుండి ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

అత్యధిక బిడ్డరునకు అస్తి అమ్మకం గురించి అధీకృత అధికారు వారు నిర్ధారణ చేయుదురు, విజేత అయిన బిడ్డరు యొక్క ధరావత్తు (ఇఎమ్‌డి) సొమ్ము అమ్మకం జరిపినవారిగా ఉండదు. విజేత కాని బిడ్డరు ధరావత్తు సొమ్ము తిరిగి చెల్లించెదరు. సదరు ధరావత్తు పై ఏ విధమైన వడ్డీ చెల్లించబడదు. అధీకృత అధికారిచే బిడ్డు ధర అంగీకరించబడిన 24 గంటల లోపుగా ముందుగా చెల్లించిన బయానా నగదుబాటుతో విజయము పొందిన బిడ్డరు అమ్మకం ధరలో 25%ను వెంటనే జమ చేయవలెను. మరియు మిగిలిన 75% అమ్మకము ధరను అమ్మకపు తేదీ 15వ దినము లోపు చెల్లించవలెను. విజయము పొందిన బిడ్డరు చెల్లింపులో విఫలమైనచో అపరు ద్వారా ఇంతకు ముందుగా ధరావత్తు చేసిన మొత్తము స్వాధీనము చేసుకొనబడును మరియు అస్తి తిరిగి వేలము చేయబడును అస్తి/మొత్తమునకు సంబంధించిన విఫలమైన బిడ్డరుపై ఎట్టి క్లెయిము/హక్కు ఉండబోదు. అమ్మకము బ్యాంకు నూచించిన నియమాలు/షరతులకు లోబడి ఉంటుంది మరియు ఎలాంటి కారణములు చూపకుండా ఏ ఒక్క ఆఫరు అయినా / అన్ని ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా రద్దుచేయుటకు బ్యాంక్ వారికి హక్కు కలదు.

తమ బిడ్డు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా M/s PSB Alliance వారి వెబ్ పోర్టల్ https://ebkray.in/eauction-psb/bidder-registration ఫోన్ నెం.8291220220 నందు సంప్రదించవచ్చును మరియు ఈ అస్తికి చెందిన వివరాల కొరకు అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హోమ్ లోన్ సెంటర్-64187 (RACPC), ఏలూరు, ఏలూరు జిల్లా, శ్రీ నంబు వీరేశ్వర రావు, సెల్ నెం: 88188 78278, ఈ-మెయిల్ ఐడి : sbi.64187@sbi.co.in మరియు బ్యాంక్ అమోదం పొందిన రిజిస్ట్రేషన్ ఏజెన్సీ : మెస్సర్స్ జె.ఆర్. అసోసియేట్స్, ఫోన్ : 95534 96667, 88853 53700 వారిని అడిగి వివరములలో సంప్రదించవచ్చును.

అస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డరు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి. మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్లో జమ అయిన సమాచారం వెబ్సైట్లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు య